మనసులోమాట
KANCHARLA
నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం..
సంచలన తెలుగు దిన పత్రిక
రాయలసీమ
కర్నూలు | అనంతపురం
చిత్తూరు | కడప
బుధవారం 20 మే 2026 పేజీలు : 6

తీరం మనది.. బోటు మనదే.. వేటా మనదే

- మత్స్యకారులకు సీఎం చంద్రబాబు భరోసా
- మత్స్యకారుల సేవలో పథకం కింద 1.30 లక్షల కుటుంబాలకు రూ. 262 కోట్లు విడుదల
- ప్రతి మత్స్యకార కుటుంబానికి రూ. 20 వేల చొప్పున ఆర్థిక చేయూత
- 60 శాతం సబ్సిడీతో 200 మెకనైజ్డ్ బోట్లు మంజూరు చేస్తామని సీఎం చంద్రబాబు హామీ
- తీరం మనది, బోటు మనదే, వేటా మనదే అంటూ మత్స్యకారులకు భరోసా
- జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణంతో ఆర్థిక బలోపేతం చేస్తామన్న ముఖ్యమంత్రి
- 60 శాతం సబ్సిడీపై 200 కొత్త మెకనైజ్డ్ బోట్లను మంజూరు: సియం హామీ

నెల్లూరు జిల్లా బ్యూరో (మనసులో మాట) మే 19: మత్స్యకారుల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు అన్ని చర్యలూ తీసుకుంటామని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, కావలి నియోజకవర్గంలోని తుమ్మలపెంటలో నేడు జరిగిన 'మత్స్యకారుల సేవలో' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వేట నిషేధ భృతి కింద రాష్ట్రవ్యాప్తంగా 1,30,796 మత్స్యకార కుటుంబాలకు రూ. 20 వేల చొప్పున, మొత్తం రూ. 262 కోట్ల ఆర్థిక సాయాన్ని వారి బ్యాంకు ఖాతాల్లోకి జమ చేశారు.

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. "సముద్రంలో చేపల వేట అంటే ప్రాణాలతో చెలగాటమాడటమే. రోజుల తరబడి సముద్రంలోనే ఉండి జీవనోపాధి పొందుతున్న మత్స్యకారులకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు ఉండే వేట నిషేధ సమయంలో వారి కుటుంబాలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతోనే ఈ ఆర్థిక చేయూత అందిస్తున్నాం. గతంలో రూ.10 వేలుగా ఉన్న సాయాన్ని, మా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.20 వేలకు పెంచాం" అని తెలిపారు. వరుసగా రెండో ఏడాది కూడా ఈ పథకం ద్వారా సాయం అందిస్తున్నామని, రెండేళ్లలో మొత్తం రూ.505 కోట్లను మత్స్యకారులకు అందించామని గుర్తుచేశారు.

మత్స్యకారులకు వరాల జల్లు

ఈ సభలో ముఖ్యమంత్రి మత్స్యకారుల కోసం పలు కీలక హామీలు ప్రకటించారు. 60 శాతం సబ్సిడీపై 200 కొత్త మెకనైజ్డ్ బోట్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. మిగిలిన మొత్తాన్ని సులభ వాయిదాల్లో రుణంగా అందిస్తామని హామీ ఇచ్చారు. "తీరం మనది, బోటు మనదే, వేటా మనదే. ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. మన తీరప్రాంతంలోకి పొరుగు రాష్ట్రాల బోట్లు వస్తే సహించేది లేదు. మత్స్యకారుల హక్కులను కాపాడటానికి నిఘా పెంచుతాం" అని చంద్రబాబు చెప్పారు. రాష్ట్రంలో మత్స్యకారుల అభివృద్ధికి రూ. 3,256 కోట్లతో 9 ఫిషింగ్ హార్బర్లు, 8 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. రూ. 288 కోట్లతో చేపడుతున్న జువ్వలదిన్నె ఫిషింగ్ - మిగతా వార్త 2లో

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వసతులపై జనసేన ఆరా

వెంకటాచలం/ ముత్తుకూరు (మనసులో మాట) మే 19: ముత్తుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు ఎలాంటి వసతులు ఉన్నాయి, అలాగే ఏ విధమైన రోగాలకు మందులు ఉన్నాయి వంటి విషయాలపై జనసేన సర్వేపల్లి నియోజకవర్గం సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలోని ముత్తుకూరు మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి అక్కడ స్థితిగతులు అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేద బడుగు బలహీన వర్గాలకు వైద్యాన్ని అందించే పి హెచ్ సి లు సి హెచ్ సి లను ప్రజలకే నిత్యం అందుబాటులో ఉండి వైద్య సేవలను అందించడంలో ఎంతో కృషి చేస్తూ ఉన్నాయన్నారు. అందులో భాగంగా సర్వేపల్లి నియోజకవర్గం లో - మిగతా వార్త 2లో

ఇరిగేషన్ అవినీతిపై కాణిపాకం లో ప్రమాణం చేస్తారా?

వెంకటాచలం/ ముత్తుకూరు (మనసులో మాట) మే 19: జిల్లాలో ఇరిగేషన్ పనులలో జరిగిన అవినీతి అక్రమాలపై తమ నాయకుడు మాజీ మంత్రి, వైసిపి ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డిని కాణిపాకం లో గాని, శ్రీశైలంలో గాని, తిరుమలలో గాని ప్రమాణం చేయించేందుకు తాము , తమ నాయకుడు సిద్ధంగా ఉన్నారని, అవినీతి జరగలేదని, కమిషన్లు తీసుకోలేదని మీరు గాని, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి గాని ప్రమాణం చేస్తారా అంటూ టిడిపి మండల అధ్యక్షులు మల్లికార్జున యాదవ్ కు వైసిపి సర్వేపల్లి నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు పాముల సీనయ్య సవాల్ విసిరారు. మంగళవారం మండల కేంద్రంలోని వైసీపీ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఇరిగేషన్ బిల్లు పనిచేయకుండానే కాంట్రాక్టర్లకు - మిగతా వార్త 2లో

దివ్యాంగజనుల ప్రపంచ స్థాయి క్రీడా అకాడమీ

వెంకటాచలం/ముత్తుకూరు (మనసులో మాట) మే 19: దివ్యాంగుల కోసం ప్రపంచ స్థాయి సమగ్ర క్రీడ మైదానాన్ని ఎస్ ఈ ఐ ఎల్ ఎనర్జీ ఏర్పాటు చేస్తుందని ప్రాజెక్టు ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు వెంకటాచలం వద్ద శంకుస్థాపన కార్యక్రమం కూడా చేసినట్టు ప్రతినిధులు తెలిపారు.నెల్లూరులోని సి ఆర్ సి వద్ద స్టేడియం నిర్మాణానికి రూ. 4.5 కోట్ల సి ఎస్ ఆర్ నిధుల తో నిర్మిస్తున్నట్టు తెలిపారు. భారతదేశంలోని అతిపెద్ద స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తిదారులలో (ఐ పి పి) ఒకటైన ఎస్.ఈ.ఐ.ఎల్. ఎనర్జీ ఇండియా లిమిటెడ్ నెల్లూరులోని వెంకటాచలం కాంపోజిట్ రీజినల్ సెంటర్ వద్ద ఇన్‌క్లూజివ్ స్పోర్ట్స్ అకాడమీ (ఐ ఎస్ ఏ) కోసం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఎస్.ఈ.ఐ.ఎల్. ఎనర్జీ ఇండియా లిమిటెడ్ చైర్మన్ తారెక్ మొహమ్మద్ సుల్తాన్ అల్ ముగైరి, డైరెక్టర్ శ్రీ సైరస్ ఎరాచ్ కూపర్, సీఈఓ జన్మేజయ మహాపాత్ర, ఎన్ఐఈపీఐడీ డైరెక్టర్ డా. (మేజర్) బి.వి. రామ్ కుమార్, సి ఆర్ సిడైరెక్టర్ ఎస్.పి. మనోజ్ కుమార్ సమక్షంలో శంకుస్థాపన చేశారు.తమ సి ఎస్ ఆర్ కార్యక్రమాల్లో భాగంగాఎస్.ఈ.ఐ.ఎల్. ఎనర్జీ ఇండియా లిమిటెడ్, దివ్యాంగజనుల కోసం సమగ్ర ఇన్‌క్లూజివ్ స్పోర్ట్స్ అకాడమీ నిర్మాణానికి రూ. 4.5 కోట్లు అందజేస్తుందన్నారు. సి ఆర్ సి, భారత ప్రభుత్వం సామాజిక న్యాయం సాధికారిత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఎన్ఐఈపీఐడీకు చెందిన ఒక శాఖ. ఇది వికలాంగుల నైపుణ్యాభివృద్ధి, పునరావాసం, సాధికారతలో ముఖ్యమైన పాత్ర - మిగతా వార్త 2లో

కోతల బాబుకి వాతలు తప్పవు

- మత్స్యకారుల్ని ఆదుకున్న చరిత్ర జగన్ దే తేల్చిచెప్పిన మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి

మిగతా 6

తీరం మనది.. బోటు మనదే.. వేటా మనదే

- మొదటి పేజీ తరువాయి హార్బర్ నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతం ఆర్థికంగా బలపడుతుందని, దీనిపై కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని కోరారు. నెల్లూరు జిల్లాలోని 25 మత్స్యకార గ్రామాలను కలుపుతూ మెటల్ రోడ్లు నిర్మిస్తామని, రూ.6.19 కోట్లతో నార్త్ బకింగ్‌హామ్ కెనాల్ పూడికతీత పనులు చేపడతామని హామీ ఇచ్చారు.

అదనపు ఆదాయం.. సాంకేతికతపై దృష్టి

చేపల వేటతో పాటు కొత్త సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా అదనపు ఆదాయం పొందాలని మత్స్యకారులకు సీఎం సూచించారు. "సీవీడ్ (సముద్రపు నాచు) సాగు ద్వారా మత్స్యకార మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతాం. దీనికి ప్రపంచవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. మత్స్యకారులు పండించే చేపలకు మంచి ధర వచ్చేలా నేనే మార్కెటింగ్ మేనేజర్‌గా వ్యవహరిస్తా" అని భరోసా ఇచ్చారు. మత్స్యకారుల రక్షణ కోసం సముద్రంలో 4,550 ట్రాన్స్‌పాండర్లను ఏర్పాటు చేసి కమ్యూనికేషన్ వ్యవస్థను పటిష్టం చేశామని వివరించారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో విధ్వంసానికి గురైందని, దానిని సరిచేయడానికే 23 నెలల సమయం పట్టిందని చంద్రబాబు విమర్శించారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని, ప్రభుత్వానికి తమ మద్దతు తెలిపారు. కృష్ణానదిలో బోట్లతో భారీ ర్యాలీ నిర్వహించి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వసతులపై జనసేన ఆరా

- మొదటి పేజీ తరువాయి సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పర్యవేక్షణలో ప్రతి పేద గిరిజనులకి వైద్యం అందించాలి ప్రతి పేద గిరిజన బిడ్డ చదువుకోవాలి వారికి ఉండటానికి ఇల్లు ఏర్పాటు చేయాలి అనేటువంటి ఆలోచనతో ఎప్పటికప్పుడు తనిఖీలను నిర్వహిస్తూ అందరికీ అన్ని విధాల అందుబాటులో ఉండి సర్వేపల్లి నియోజకవర్గ అభివృద్ధికి దోహదపడుతున్నారు. ఆయనతోపాటు కూటమిలో భాగంగా మా వంతు మేము మా అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు గ్రామపంచాయతీలో పారిశుద్ధ పనులు, ప్రైమరీ హెల్త్ సెంటర్స్ నందు స్వచ్ఛభారత్ కార్యక్రమాల నిర్వహణ తో పాటు అక్కడ పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా పేదలకు అందించే వైద్య విషయంలో ఏ చిన్న పొరపాటు జరిగిన అధికారులపై చర్యలు తీసుకునే విధంగా పూర్తిస్థాయిలో ఎప్పటికప్పుడు పరిశీలించడం జరుగుతోందన్నారు. అందులో భాగంగా ముత్తుకూరు ప్రైమరీ హెల్త్ సెంటర్ ని పరిశీలించి అక్కడ కొన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని వారికి తెలియజేయడం జరిగిందన్నారు . పేదవాడికి అందించే వైద్య విషయంలో ఏదైనా చిన్న పొరపాటు జరిగినా సరే ఎవర్ని కూడా ఉపేక్షించేది లేదన్నారు. అక్కడ ఉన్నటువంటి అధికార యంత్రాంగానికి తెలియజేయడం జరిగిందని,కూటమి ప్రభుత్వం పేదల కోసం పేద బడుగు బలహీన వర్గాల కోసం వారి యొక్క జీవితాలలో వెలుగులు నింపడం కోసం నిత్యము వారికి అందుబాటులో ఉండి వారిని కంటికి రెప్పలా కాపాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముత్తుకూరు మండల సీనియర్ నాయకులు రహీం, బోలా అశోక్, దగ్గోలు సుమన్ వెంకటాచలం మండల కార్యదర్శి సందూరి శ్రీహరి, చిన్న, దినేష్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ లా సెట్‌లో మెరిసిన ధర్మవరం యువకుడు సందా రాఘవ

ధర్మవరం మే 19 (మనసులో మాట) శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని కొత్తపేటకు చెందిన యువ నాయకుడు సందా రాఘవ ఏపీ లా సెట్ ఫలితాలలో ప్రతిభ కనబరిచి 3023 ర్యాంకు సాధించారు. సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన రాఘవ తన కృషి, పట్టుదలతో ఈ విజయాన్ని అందుకోవడం స్థానికంగా హర్షాతిరేకాలకు కారణమైంది.ప్రస్తుతం తెలుగుదేశం పార్టీలో చురుకైన కార్యకర్తగా కొనసాగుతున్న సందా రాఘవ, రాజకీయాలకే పరిమితం కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటున్నారు. పట్టణంలో పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, అవసరమైన వారికి సహకారం అందిస్తూ దాతృత్వాన్ని చాటుకుంటూ మంచి గుర్తింపు పొందారు.ఇప్పుడు లా సెట్‌లో మంచి ర్యాంకు సాధించడం ద్వారా ఆయనకు

న్యాయవాద వృత్తిలోకి అడుగుపెట్టే అవకాశం రావడంతో స్నేహితులు, కుటుంబ సభ్యులు, బంధువులు, పార్టీ నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో న్యాయ రంగంలో ఉన్నత స్థానాలు అధిరోహించి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షిస్తూ పలువురు అభినందనలు తెలిపారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

పలమనేరు మే 19(మనసులో మాట) :పలమనేరు డివిజన్‌లో నిర్వహించిన పీ.సీ.పీ.ఎన్.డీ.టీ సమావేశంలో పలమనేరు డివిజనల్ అధికారి డా. జి. వెంకటప్రసాద్, పలమనేరు ఆర్‌డీఓ భవాని, డాక్టర్ మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వ ప్రైవేట్ వైద్యాధికారులు, స్కానింగ్ సెంటర్ నిర్వాహకులతో సమావేశాన్ని పీసీపీఎన్‌డీటీ చట్టం అమలు, గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షల నిషేధం,బాలికల సంరక్షణ, మహిళల హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. చట్ట నిబంధనలను ప్రతి వైద్య సంస్థ తప్పనిసరిగా

పాటించాలని అధికారులు స్పష్టం చేశారు. స్కానింగ్ కేంద్రాలలో ఫామ్-ఎఫ్ రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, రోగుల వివరాలు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అదేవిధంగానిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆడశిశువు పట్ల గౌరవ భావన పెంపొందించేందుకు వైద్యులు, సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సేవలు అందిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని సూచించారు. వైద్య రంగానికి సంబంధించిన పలు సమస్యలు పరిష్కార మార్గాలపై కూడా చర్చించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ ప్రైవేట్ వైద్య రంగాలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు.

దివ్యాంగజనుల ప్రపంచ స్థాయి క్రీడా అకాడమీ

- మొదటి పేజీ తరువాయి పోషిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎస్.ఈ.ఐ.ఎల్. ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సీఈఓ జన్మేజయ మహాపాత్ర మాట్లాడుతూప్రతి వ్యక్తికీ అభివృద్ధి చెందేందుకు, పోటీ పడేందుకు, తమ పూర్తి సామర్థ్యాన్ని సాకారం చేసుకునేందుకు అవకాశాలు అందుబాటులో ఉండాలన్నారు. ఎస్.ఈ.ఐ.ఎల్. ఎనర్జీ లో మేము నిజమైన పురోగతి అనేది అభివృద్ధి సమగ్రంగా ఉన్నప్పుడే సాధ్యమని నమ్ముతున్నాం. ఈ ఇన్‌క్లూజివ్ స్పోర్ట్స్ అకాడమీ ద్వారా, దివ్యాంగజనులు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడానికి, క్రీడల్లో ప్రతిభను మెరుగుపరుచుకోవడానికి, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో గౌరవప్రదంగా పాల్గొనడానికి ఒక ప్రత్యేక వేదికను సృష్టించాలని ఆశిస్తున్నాం. ఈ కార్యక్రమం అర్థవంతమైన దేశ నిర్మాణం మరియు సమాజ సాధికారత పట్ల మా నిరంతర కట్టుబాటును ప్రతిబింబిస్తుందన్నారు. ఇన్‌క్లూజివ్ స్పోర్ట్స్ అకాడమీని శారీరక, మానసిక వికలాంగత కలిగిన వ్యక్తుల కోసం జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో అనేక క్రీడా విభాగాలను నిర్వహించగల అన్ని వాతావరణాలకు అనుకూలమైన ఇండోర్ క్రీడా స్టేడియంగా రూపకల్పన చేశారు. సుమారు 15,000 చదరపు అడుగుల అంతర్గత స్టేడియం ప్రదేశంలో బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, టీమ్ హ్యాండ్‌బాల్, పవర్‌లిఫ్టింగ్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, ఫ్లోర్ హాకీ, ఫ్లోర్‌బాల్, వీల్‌చెయిర్ బాస్కెట్‌బాల్, సిట్టింగ్ వాలీబాల్, బోచ్చే తదితర క్రీడలను నిర్వహించవచ్చు. అదనంగా ఈ స్టేడియంలో సుమారు 300 మందికి కూర్చునే సౌకర్యం, బాలురు, బాలికలు, అధికారుల కోసం వేర్వేరు డ్రెస్సింగ్ రూములు మరియు మరుగుదొడ్లు, అలాగే విద్యుత్ బ్యాకప్ సౌకర్యాలు కూడా ఉంటాయన్నారు.

ఇరిగేషన్ అవినీతిపై కాణిపాకం లో ప్రమాణం చేస్తారా?

- మొదటి పేజీ తరువాయి బిల్లులు చేయించి వారి వద్ద కమిషన్లు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తీసుకోవడం జరిగిందని తమ నాయకుడు కాకాని గోవర్ధన్ రెడ్డి పలుమార్లు చెబుతున్న దానిపై సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి స్పందించకపోవడం విచారకరమన్నారు. అవినీతి చేయకపోతే సోమిరెడ్డి మాట్లాడవచ్చు కదా అని ప్రశ్నించారు. టిడిపి మండల అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్ స్థాయిని మించి తమ నాయకుడు కాగాని గోవర్ధన్ రెడ్డిని విమర్శించడం తగదు అన్నారు. కాకాని గోవర్ధన్ రెడ్డి మల్లికార్జున యాదవ్ గురించి ఆలోచిస్తే భస్మం అయిపోయే పరిస్థితి ఏర్పడుతుందని శీనయ్య తెలిపారు. మల్లికార్జున యాదవ్ నేను కలిసి ఒకే చోట పని చేయడం జరిగిందని అతని పరిస్థితి ఏమిటో తనకు పూర్తిగా తెలుసని, మల్లికార్జున యాదవ్ గాని సోమిరెడ్డి గాని అవినీతి అక్రమాలు జరగలేదని ప్రమాణాలు చేయగలరా అని ప్రశ్నించారు. కాకాని గోవర్ధన్ రెడ్డి గురించి పెద్ద లీడర్లే మాట్లాడరని కానీ అదృష్టం బుద్ధి వచ్చిన పదవిని అడ్డం పెట్టుకొని మల్లికార్జున యాదవ్ స్థాయిని మించి ఆయన విమర్శించడం తగదు అన్నారు. గోవర్ధన్ రెడ్డి గురించి మరొకసారి మాట్లాడితే నీ అవినీతినీ బట్టబయలు చేస్తానని మల్లికార్జున యాదవ్ హెచ్చరించారు. బ్రహ్మదేవం సాగు గ్రేట్ సంగం అధ్యక్షులు నీలం ఆలూరు విష్ణువర్ధన్ రావు చాలా హుందాతనంగా మీడియా ముందు మాట్లాడటం జరిగిందని అతనిని చూసి మల్లికార్జున యాదవ్ నేర్చుకోవాల్సిన విషయాలు అనేక ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు బందెల వెంకటసుబ్బయ్య, ఎంపిటిసి సభ్యులు పెడకాల శివ, ఎంపీటీ సభ్యులు నవీద్ భాష, నాయకులు దువ్వూరు మోహన్ రెడ్డి, మస్తాన్, పెడకాల నరసింహం తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువులు వాడకాన్ని అరికడదాం

- ప్రకృతి వ్యవసాయాన్ని ఆదరిద్దాం

కోవూరు, ఇందుకూరుపేట, మే -19 (మనసులో మాట):రసాయన ఎరువులు, పురుగుల మందుల వాడకంతో భూములు నిర్జీవంగా మారుతున్న ప్రస్తుత రోజుల్లో.. ప్రకృతి వ్యవసాయం ఎంతైనా అవసరమని ప్రకృతి వ్యవసాయ నిపుణురాలు ఖ.ఎ.తీ.జూ ఎన్. పెంచలమ్మ అన్నారు. నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలం దేవీస్ పేట గ్రామం లో పర్యటించిన తిరుపతి జిల్లా ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంల విద్యార్థులకు ఆమె ప్రకృతి వ్యవసాయంపై ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం లో ప్రత్యేక అవగాహన కల్పించారు.

పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన, ఆరోగ్యకరమైన దిగుబడులను ఎలా సాధించవచ్చో విద్యార్థులకు ప్రాక్టికల్‌గా వివరించారు. జీవామృతం, ఘనజీవామృతం, కషాయాల తయారీ విధానాన్ని, వాటి వల్ల పంటలకు జరిగే మేలును ఈ సందర్భంగా విద్యార్థులకు కళ్ళకు కట్టినట్లు చూపించారు. కాబోయే వ్యవసాయ అధికారులుగా విద్యార్థులు ప్రకృతి వ్యవసాయంపై పూర్తి అవగాహన పెంచుకుని, రైతుల్లో మార్పు తీసుకురావడానికి కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగుల మందులు వాడి భూములను పాడు చేసుకుంటున్నాం. దీని వల్ల పెట్టుబడి పెరిగిపోతోంది, రోగాలు కూడా ఎక్కువవుతున్నాయి. కానీ ప్రకృతి వ్యవసాయం ద్వారా పెట్టుబడి లేకుండా, ఇంట్లోనే జీవామృతం, ఘనజీవామృతం తయారు చేసుకుని అద్భుతమైన దిగుబడులు సాధించవచ్చు అన్నారు

అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ కాలేజీలో పుస్తకాల్లో చదువుకున్న దానికంటే.. ఇక్కడికి వచ్చి ప్రాక్టికల్‌గా చూడడం వల్ల ఎంతో అవగాహన వచ్చింది అన్ని జీవామృతం, కషాయాల తయారీ గురించి పెంచలమ్మ చాలా బాగా వివరించారు అన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల భూమికి, మానవ ఆరోగ్యానికి జరిగే మేలును తెలుసుకున్నాం అన్ని తెలిపారు

జొన్నలు కొనుగోలు చేశారు వదిలేసారు

- తూకాలు వేసి రైతుల ఇండ్ల దగ్గరే వదిలేసిన సివిల్ సప్లైయ్ అధికారులు.

- ట్రాన్స్ పోర్ట్ సమస్యను పరిష్కరించకపోతే సివిల్ సప్లైయ్ ఆఫీసును ముట్టడిస్తాం

చెన్నూరు, మే,19, ముండ్లపల్లెలో తూకాలు వేసి వదిలేసిన జొన్న బస్తాలను పరిశీలించిన రైతు సంఘం నాయకులు చెన్నూరు మండలం రామనపల్లి ముండ్లపల్లి రాచనాయన పల్లి తదితర గ్రామాలలో 50 మంది రైతుల దగ్గర రెండువేల క్వింటాళ్లు జొన్నలను కొనుగోలు చేసి పది రోజుల నుండి రైతుల ఇళ్ల దగ్గరనే వదిలివేయడం సరైనది కాదని ఏపీ రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి తెలిపారు . మంగళవారం ముండ్ల పల్లె రాచినాయన పల్లె గ్రామాలలో రైతుల ఇళ్ల దగ్గర తూకాలు వేసి వదిలేసిన జొన్న బస్తాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి రైతులతో మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో జొన్నలు తక్కువ రేటు ఉండడంతో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు జొన్నలు కొనుగోలు చేయమని సివిల్ సప్లై అధికారులు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని అందులో భాగంగానే పై గ్రామాలలో రైతుల దగ్గర జొన్నలు కొనుగోలు చేసి ఇండ్ల దగ్గరే వదిలివేయడం చాలా అన్యాయమని ఆయన తెలిపారు ఈ విషయంపై సివిల్ సప్లై అధికారులను అడుగితే ట్రాన్స్పోర్ట్ లారీల సమస్య ఉందని చెప్పడం జరిగిందన్నారు జొన్నలు కొనుగోలుకు ఆదేశాలు ఇచ్చినప్పుడు సమయంలోనే ట్రాన్స్పోర్ట్ సమస్య ముందుగా గుర్తించడంలో విఫలం చెందారని ఆయన తెలిపారు తక్షణమే రైతుల ఇళ్ల దగ్గర కొనుగోలు చేసిన జొన్నలను తీసుకోవాలని రైతుల ఖాతాలో డబ్బులు త్వరగా జమ చేయాలని ఆయన కోరారు ఇంకా గ్రామాలలో జొన్నలు రైతుల ఇళ్ల దగ్గర ఉన్నాయని వాటిని కూడా కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తక్షణమే సమస్యను పరిష్కరించకపోతే సివిల్ సప్లై ఆఫీసును ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జొన్న బాధిత రైతులు సుధాకర్ రెడ్డి శివశంకర్ పవన్ పుల్లయ్య మల్లికార్జునెడ్డి తో పాటు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య రైతులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడికి మంత్రి సత్య కుమార్ యాదవ్ చొరవతో రూ.2.50 లక్షల సహాయం

ధర్మవరం మే 19 (మనసులో మాట) ధర్మవరం నియోజకవర్గం బత్తలపల్లి మండలం అప్పరాచెరువు గ్రామానికి చెందిన ఎం. తరుణ్ కుమార్ రెడ్డి గత 12 సంవత్సరాలుగా క్రానిక్ మైలోయిడ్ లుకేమియా వ్యాధితో బాధపడుతున్న విషయం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖామంత్రి , ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ దృష్టికి వచ్చినట్లు మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు వారి కార్యాలయం సిబ్బంది తెలిపారు. వారు మాట్లాడుతూ తరుణ్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులు మంత్రి సత్య కుమార్ యాదవ్ కలిసి తమ కుటుంబ పరిస్థితిని, దీర్ఘకాలిక వైద్య చికిత్స కారణంగా ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను వివరించినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల వినతిపై మంత్రి వెంటనే స్పందించి, బాధితుడికి

అవసరమైన వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవడం జరిగింది అన్నారు. ఈ మేరకు మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రభుత్వానికి ప్రత్యేకంగా లేఖ రాయగా, ముఖ్యమంత్రి సహాయ నిధి పరిధిలో లెటర్ ఆఫ్ క్రెడిట్ ద్వారా హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం రూ.2,50,000 ఆర్థిక సహాయం మంజూరైనట్లు వారు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అధికారిక ఉత్తర్వులు జారీ కావడంతో బాధిత కుటుంబానికి పెద్ద ఊరట లభించింది. కష్టకాలంలో తమ కుటుంబానికి అండగా నిలిచి వైద్య సహాయం అందేలా చొరవ చూపిన మంత్రి సత్య కుమార్ యాదవ్ కు తరుణ్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కాసుల కోసమే కండలేరు డౌన్ స్టీమ్ మట్టి పనులు

డ్యామ్ పటిష్టత కొరకు జరిగే పనుల్లా కనిపించడం లేదు

నెల్లూరు జిల్లా బ్యూరో (మనసులో మాట) మే 19: డామ్ మట్టికట్ట ఎనిమిది– పది కిలోమీటర్ల మధ్య జరుగుతున్న పనులపై ప్రత్యేక అధికారి చేత దర్యాప్తు జరిపించాలని తెలుగు గంగ ప్రాజెక్టు డిప్యూటీ ఎస్ ఈ వీర శేఖర్ రెడ్డి కి బిజెపి నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ విజ్ఞప్తి చేశారు. కండ్లేర్ డ్యాం మటికట్ట లోపలి భాగంలో ఎనిమిది పది కిలోమీటర్ల మధ్య దెబ్బతిన్న రివిట్మెంట్ పటిష్ట పరచాల్సి ఉంది. డ్యాములో నీటి నిల్వలు ఉన్నాయని రివిట్మెంట్ పనులు ఆగి ఉన్నాయి. ప్రస్తుతం డ్యాం డౌన్ స్టీమ్ లో జరుగుతున్న పనులు పలు అనుమానాలు తావిస్తున్నాయి. క్యాచ్ మెంట్ కెనాల్స్ వద్ద జరుగుతున్న పనులు పరిశీలిస్తే కాంట్రాక్టర్లకు కాసులు కోసమే ఈ పనులు జరుగుతున్నట్లు భావిస్తున్నాము. ఈ పనులేవి మట్టి కట్ట పటిష్టతకు సంబంధించిన పనులు కావు.. ఈ పనులపై తమకు అభ్యంతరాలు ఉన్నాయని రమేష్ డిప్యూటీ ఎస్ఈ కి వివరించారు. ప్రత్యేక అధికారి చేత దర్యాప్తు జరిపించాలని రమేష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేత నరాల సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

నెల్లూరు / పొదలకూరు (మనసులో ఎఫ్ఘ్) మే 19: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా స్థానిక పొదలకూరు బస్టాండ్ నందు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది ఈ సందర్భంగా పొదలకూరు ఏరియా బాధ్యులు అల్లాడి గోపాల్ మాట్లాడుతూ చిన్ననాటి నుండి కులతత్వానికి వ్యతిరేకంగా పోరాడిన సంఘసంస్కర్త అని కొనియాడారు తన పేరులోని రెడ్డి అని పేరును తొలగించి సుందరయ్యగా చరిత్రకెక్కిన వ్యక్తి అన్నారు ప్రతిపక్ష నాయకుడిగా పార్లమెంటుకు సైకిల్ మీద వెళ్లి ఉన్నత ప్రమాణాలను నెలకొల్పిన నిరాడంబద నాయకుడు అన్నారు అనంతరం మండల కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల కూలీల రేట్ల కోసం దేశవ్యాప్త ఉద్యమానికి నాంది పలికిన నాయకుడు అన్నారు దేశ ప్రజలే తన పిల్లలుగా భావించి సంతానం వద్దనుకుని తన జీవితాన్ని దేశం కోసం పీడిత ప్రజల కోసం అర్పించిన త్యాగ ధనులన్నారు అనంతరం కమ్యూనిస్టు పార్టీలో కొత్తగా చేరిన వారితో ప్రమాణం చేయించారు ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రంగయ్య తిరుపాలు ఆటో కార్మికులు నాగార్జున వెంకటేశ్వర్లు పురుషోత్తం హమాలీ వర్కర్స్ వెంకటేశ్వర్లు మనీ ప్రసాద్ తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ కె చందన మణికి డాక్టరేట్ ప్రధానం

పలమనేరు మే 19(మనసులో మాట) : పట్టణ సమీపంలోని మదర్ తెరిసా ఇంజనీరింగ్ కళాశాలలో సి.ఎస్.ఈ విభాగపు అష్ట ప్రొఫెసర్ ఆర్. కె చందనామణికి డాక్టరేట్ డిగ్రీ అవార్డు అయినట్లు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎం.రవీంద్రబాబు తెలిపారు. వేలూరులోని విట్ యూనివర్సిటీలో బెస్ట్ క్యాన్సర్ ఇమేజ్ యూజింగ్ డీప్ లర్నింగ్ అనే అంశంపై వీరు పరిశోధన చేసి సమర్పించిన సిద్ధాంత వ్యాసానికి విట్ యూనివర్సిటీ డాక్టరేట్ డిగ్రీని ప్రధానం చేసినట్లు ఎం. రవీంద్రబాబు తెలిపారు.ఆర్. కె చందనామణికి డాక్టరేట్ డిగ్రీ అవార్డు రావడం పట్ల కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎం. రవీంద్రబాబు, చైర్మన్ ఎం.ఆర్ సునీల్, ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ రాజేందర్ రెడ్డి, సి ఎస్ ఈ విభాగపు హెచ్ ఓ డి డాక్టర్ ప్రభు, సహచర అధ్యాపకులు వీరిని అభినందించారు.

తాసిల్దార్ ఎంఇఓ కార్యలయల సిబ్బందికి రక్తపోటుపరీక్షలు

చెన్నూరు, మే,19.. ప్రపంచ రక్తపోటు దినోత్సవ సందర్భంగా మంగళవారం చెన్నూరు ఆరోగ్య కేంద్రం పరిధిలోని తాసిల్దార్ కార్యాలయం ఎంఇఓ కార్యలయలసిబ్బందికి బిపి. షుగర్ హిమోగ్లోబిన్ పరీక్ష నిర్వహించడం జరిగింది. తాసిల్దార్ కార్యాలయం లో తాసిల్దార్ విజయకుమారి కి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ గంగిరెడ్డి కి వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ వినయ్ కుమార్ రెడ్డి పాల్గొనడం జరిగింది. ప్రభుత్వ ఉద్యోగులందరూ తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాల్సిందిగా తాసిల్దార్ విజయకుమారి తెలియడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గంగిరెడ్డిమరియు తాసిల్దార్ సిబ్బంది ఎంఇఓ ఇబ్బంది పాల్గొని పరీక్షలు చేయించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పి హెచ్ సి సంజీవని తనిఖీ

పలమనేరు మే 19(మనసులో మాట) : గంగవరం మండలంలో ఉన్న పీహెచ్సీ నందు మంగళవారం అడిషనల్ డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ వెంకట ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డ్యూటీలో ఉన్నవారు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం ఆరోగ్య సిబ్బందికి తగు సూచనలు సలహాలు అందించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేషంట్లకు మెరుగైన వైద్యం అందుతున్నదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి తోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ సద్వినియోగం చేసుకోండి

పెద్దపంజాణి (మనసులో మాట మే 19): ప్రభుత్వం నూతనంగా విడుదల చేసిన జీవో ప్రకారం వెనుకబడిన తరగతుల వర్గాలకు ఉచిత విద్యుత్ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని పెద్దపంజాణి ఎంపీడీవో బాలాజీ పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పెద్దపంజాని మండల పరిధిలోని రజక, స్వర్ణకార, నాయీ బ్రాహ్మణ మరియు అత్యంత వెనుకబడిన వర్గాల (ఎంబీసీ) లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్ పథకంపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. అర్హులైన లబ్ధిదారులు ఈ క్రింది సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పథకం వివరాలు మరియు అర్హతలు.. రజక / చాకలి వర్గాలు: నెలకు 150 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ (లాండ్రి షాపు కలిగి ఉండవలెను). స్వర్ణకార / విశ్వబ్రాహ్మణ వర్గాలు: నెలకు 100 యూనిట్ల

వరకు ఉచిత విద్యుత్ (స్వర్ణకార షాపు కలిగి ఉండవలెను). నాయీ బ్రాహ్మణ వర్గాలు: నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ (హెయిర్ కటింగ్ సెలూన్ షాపు కలిగి ఉండవలెను). ఎం.బి.సి. వర్గాలు: పేదరిక రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు నెలకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్. కావలసిన పత్రాలు:ఈ పథకం కింద లబ్ధి పొందదలచిన వారు క్రింది పత్రాలతో తమ పరిధిలోని పెద్దపంజాణి విద్యుత్ కార్యాలయం లోగాని అసిస్టెంట్ ఇంజనీర్ , స్థానిక గ్రామ/వార్డు సచివాలయాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు.రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్ ,కుల ధృవీకరణ పత్రం ప్రస్తుత విద్యుత్ బిల్లు లేదా సర్వీస్ నంబర్ లేబర్ డిపార్ట్‌మెంట్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ ఇందుకు జత చేయాలన్నారు. ఈ సర్టిఫికేట్ లేని వారు స్థానిక సచివాలయం ద్వారా పొందవచ్చునాని ఎం.బి.సి. వర్గాలకు ఫామ్ సి సర్టిఫికేట్ అవసరం లేదని ఆయన వివరించారు. పెద్దపంజాని మండలంలోని అర్హులైన లబ్ధిదారులందరూ వెంటనే తమ సచివాలయ సిబ్బందిని లేదా విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించి, దరఖాస్తు చేసుకొని ఈ ప్రభుత్వ సంక్షేమ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

విద్యార్థులుకు ఇంగ్లీష్ గ్రామర్ ఎంతో అవసరం

గ్రంథాలయ అధికారిని అంజలి సౌభాగ్యవతి.

ధర్మవరం మే 19 (మనసులో మాట) విద్యార్థులుకు ఇంగ్లీష్ గ్రామర్ ఎంతో అవసరమని, అప్పుడే భవిష్యత్తులో ముందంజలో ఉంటారని గ్రంథాలయ అధికారిని అంజలి సౌభాగ్యవతి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి శిక్షణా తరగతులకు ఎల్ఐసి నాగరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని ఇంగ్లీష్ గ్రామర్ బోధించడం జరిగిందన్నారు. తదుపరి నీతి

పద్యాలు, నీతి కథలు, పుస్తకాలను చదివించుట చేయడం జరిగిందన్నారు. పిల్లలకు రీడింగ్ ను ఎలా చదవాలి అనే విషయాన్ని కూడా విద్యార్థులకు తెలియజేశామని తెలిపారు. నేటి ఈ శిక్షణా కార్యక్రమంలో 38 మంది విద్యార్థులు రిసోర్స్ పర్సన్స్ ఇద్దరు పాల్గొనడం జరిగిందన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది రాము, శివమ్మ, రమణా నాయక్, గంగాధర్, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనాభా గణన 2027 కు ధర్మవరం రూరల్ లో 95 శాతము పూర్తి..

- తాసిల్దార్ సురేష్ బాబు

ధర్మవరం మే 19 (మనసులో మాట) ప్రభుత్వ ఆదేశాల మేరకు భారత దేశ జనాభా గనన 2027 ప్రకారం మే 18 వ తేదీ నాటికి 95 శాతము పూర్తి చేసినట్లు తాసిల్దార్ సురేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూరల్ పరిధిలో మొత్తం ఉన్న వి 16,344 కాగా ఇప్పటివరకు జనాభా గణన మా సిబ్బంది అధికారుల ద్వారా 15,667 ఇండ్లు పూర్తి చేయడం జరిగిందని వారు తెలిపారు. హౌస్ వర్స్ లో 11,481(కుటుంబంలో ఉన్నవాళ్లు) కలవన్నారు. ఈ కార్యక్రమం మే 30వ తేదీ వరకు కొనసాగుతుందని, నూరు శాతం పూర్తి

చేస్తామని వారు తెలిపారు. ఈ జనాభా గణన లెక్కల కోసం ఎనిమినేటర్స్ 96 మంది సూపర్వైజర్లు 16 మంది తమ విధులలో కొనసాగిస్తున్నారని తెలిపారు. కేవలం గృహ స్థితిగతులు లను మౌఖికంగా కుటుంబం సమక్షంలోనే అడుగుతున్నామని తెలిపారు. మా సిబ్బంది ఆధార్ నెంబరు కానీ బ్యాంకు అకౌంట్ ఖాతా నెంబర్ గాని అడగడం లేదని వారు స్పష్టం చేశారు. కొంతమంది అపోహలకు వెళ్లి మా సిబ్బందికి సహకరించడం లేదని వారు తెలిపారు. మా సిబ్బంది ఎవరైనా ఆధార్ నెంబర్ కానీ బ్యాంకు ఖాతా నెంబర్ గాని అడిగినచో చెప్పవద్దని కూడా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో. హేమలత పాల్గొన్నారు

కిషోరి బాలికలకు చట్టాలపై అవగాహన

గంగాధరనెల్లూరు, మే 19 (మనసులో మాట): గంగాధరనెల్లూరు నియోజక వర్గం కార్వేటినగరం మండలం ఆర్ కే వి బి పేట సచివాలయ పరిధిలోని ఇందిరానగర్ కాలనీ అంగన్వాడి కేంద్రంలో కిషోరి వికాసం కార్యక్రమంలో భాగంగా చట్టాలపై అవగాహన కల్పించారు. సిడిపిఓ శోభారాణి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ శోభారాణి, సూపర్వైజర్ రోజా రమణి, మహిళా పోలీస్ రాజేశ్వరి మాట్లాడుతూ

కిషోర బాలికలకు చట్టాలపై అవగాహన కల్పిస్తూ ఇటీవల కాలంలో బాలికలపై లైంగిక దాడులు జరుగుతున్నాయని, కావున గుడ్ టచ్ – బ్యాడ్ టచ్

లను గుర్తించి తల్లిదండ్రులకు అధికారులకు చెప్పి పిల్లలపై లైంగిక నేరాల రక్షణ చట్టం (ఫోక్సో) బాధపడుతుందన్నారు .యుక్త వయసు రాకముందే వివాహాలు జరుగుతున్న, జరిపిస్తున్న 1098 లేదా100 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. మానసికంగా, శారీరకంగా, ఆర్థికంగా హింసించడం కూడా నేరమే ఇటువంటి గృహహింస జరుగుతుంటే పిల్లలు గుర్తిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.పెళ్లిళ్లలో వరకట్నం ఇవ్వడం తీసుకోవడం నేరం ఈ వరకట్నం కారణంగా మహిళలపై హింసకు కారణమవుతుందన్నారు.

విద్యార్థి దశలోనే బాగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నతమైన ఉద్యోగాలతో స్థిరపడాలని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి జీవిత, ఏఎన్ఎం మునీశ్వరి, అంగన్వాడి కార్యకర్తలు, మమత,కుమారి, సుబ్బలక్ష్మి, జయచిత్ర, నిర్మల, అంగన్వాడి హెల్పర్స్, ఆశ వర్కర్లు, కిషోరి బాలికలు పాల్గొన్నారు.

దళితుల ద్రోహి జగన్

గంగాధరనెల్లూరు, మే 19 (మనసులో మాట): దళిత ద్రోహి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని ఎస్ఆర్ పురం మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు అన్నారు. మంగళవారం ఎస్ఆర్ పురం మండలం కటికపల్లి పంచాయతీలో వైసిపి మాజీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం సంస్మారణ సభ నిర్వహించారు. వీధి సుబ్రహ్మణ్యం చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ పురం మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం లో దళితులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు చేసి హత్య రాజకీయాన్ని ప్రోత్సహించింది వైసీపీ ప్రభుత్వమని తెలిపారు. వీధి సుబ్రహ్మణ్యం డ్రైవర్గా పనిచేస్తున్నప్పుడు అతన్ని చంపి డోర్ డెలివరీ చేసిన ఘనత గత వైసిపి ప్రభుత్వాన్నిదని తెలియజేశారు. గత మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి నాపైన సుమారు 18 కేసులో పెట్టారు. మాట్లాడితే కేసులు.. అలా గ్రామాల్లో తీరిగితే కేసులు పెట్టి నన్ను ఇబ్బంది చేసినా ధైర్యంగా ఎదుర్కొన్నానని జయశంకర్ నాయుడు మంది పడ్డారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

గంగాధరనెల్లూరు, మే 19(మనసులో మాట): గంగాధరనెల్లూరు మండలంలోని 32 గ్రామ పంచాయతీలో జనసేన పార్టీ బలోపేతానికి పక్కా ప్రణాళికతో ముందడుగు వేస్తున్నట్లు జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ యుగంధర్ స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం యొక్క లక్ష్యం నెరవేరే విధంగా ప్రజా సమస్యలపరిష్కారానికి విశేషమైన కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. స్థానిక మండల అధికారులతో సమన్వయం వంటి అంశాలను చర్చించారు.వాడవాడలా జనసేన పార్టీ జెండా రెప రెప లాడేలా వినూత్నమైన కార్యక్రమాలు చేయాలనిమండల నాయకులకు దిశా నిర్దేశం చేశారు.అందరూ కలిసికట్టుగా పవన్ కళ్యాణ్ గారి లక్ష్యసాధనకు కృషి చేద్దామని తెలిపారు.జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజలు తీసుకెళ్లాలని తెలియజేయడం ప్రజా సమస్యల పరిష్కారానికి విశేషమైన కృషి చేస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సురేష్ రెడ్డి, మండలఉపాధ్యక్షులు వెంకటాద్రి, రషీద్, ప్రధాన కార్యదర్శులు దాము సతీష్ ,, జిల్లా సంయుక్త కార్యదర్శి రాఘవ, బీసీ సెల్ అధ్యక్షులు వెంకటేష్,జనసేన పార్టీ నాయకులు జగదీష్, కిషోర్ , శరవణ, చందు, వెంకటేష్, రమేష్ బాబు, అలీ షేర్, శ్రీనివాసులు, హరి ప్రసాద్, తారక్, దుర్గాప్రసాద్, సైనికులు పాల్గొన్నారు.

రూ.1 కోటి విలువైన 500 మొబైల్ ఫోన్లు రికవరీ

- బాధితులకు సి ఇ ఐ ఆర్ ద్వారా మొబైల్ ఫోన్ల అప్పగింత

తిరుపతి జిల్లా బ్యూరో మే 19 (మనసులో మాట): తిరుపతి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన "మొబైల్ రికవరీ మేళా" కార్యక్రమంలో 14వ దశలో భాగంగా సుమారు రూ.1 కోటి విలువైన 500 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. ఇప్పటివరకు నిర్వహించిన 13 దశల్లో మొత్తం రూ.10 కోట్లు 52 లక్షల 70 వేల విలువైన 4,785 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు తిరుపతి జిల్లా ఎస్పీ యల్. సుబ్బరాయుడు తెలిపారు. తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరి జీవితంలో కీలక భాగమైందన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వారు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండానే సి ఈ ఐ ఆర్ సేవల ద్వారా ఇంటి నుంచే ఫిర్యాదు నమోదు చేసుకునే అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి కూడా మొబైల్ ఫోన్లను ట్రాక్ చేసి రికవరీ చేస్తున్నట్లు తెలిపారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వారు 9490617873 వాట్సాప్ నంబర్‌కు హాయ్" అని మెసేజ్ పంపడం ద్వారా సి ఈ ఐ ఆర్ సేవలకు సంబంధించిన లింక్ పొందవచ్చని వివరించారు. సి ఈ ఐ ఆర్ ద్వారా ఫిర్యాదు నమోదు విధానంసి ఈ ఐ ఆర్ అధికారిక వెబ్‌సైట్-ల ద్వారా మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన సందర్భంలో ఆన్లైన్లో ఫిర్యాదు నమోదు చేయవచ్చు. ఐ ఎం ఈ నంబర్‌ను బ్లాక్ చేయడం ద్వారా మొబైల్‌ను దేశవ్యాప్తంగా వినియోగించకుండా నిలిపివేయవచ్చు. మొబైల్ లభించిన తర్వాత అదే పోర్టల్ ద్వారా అన్‌బ్లాక్ చేసుకునే అవకాశం ఉంటుంది. ప్రజలకు సూచనలు మొబైల్ పోగొట్టుకున్న వెంటనే సిమ్ కార్డును బ్లాక్ చేయించాలి. ఫోన్ పే గూగుల్ పే పేటియం వంటి యాప్‌లకు బలమైన పాస్‌వర్డు ఉపయోగించాలి. వెంటనే సి ఈ ఐ ఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలి. అపరిచితుల నుంచి మొబైల్ ఫోన్లు కొనుగోలు చేయరాదు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తిరుపతి సైబర్ క్రైమ్ విభాగం సీఐ ఆర్. వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం మొబైల్ ట్రాకింగ్, రికవరీ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మొబైల్ రికవరీలో ప్రతిభ కనబరిచిన సైబర్ క్రైమ్ సిబ్బందికి అభినందన పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటరావు (పరిపాలన), సైబర్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

మహనీయుల మార్గమే కాదు.సమాజ సేవలోనూ దూసుకుపోతున్న బహుజన యూత్ ఫోర్స్

- మరోసారి మానవత్వాన్ని చాటుకున్న బహుజన యూత్ ఫోర్స్
- మట్టిలో మాణిక్యం దారా సంతోష్ కు అండగా బహుజన యూత్ ఫోర్స్
- ఎందరికో ఆదర్శంగా నిలుస్తూ పలువురి ప్రశంసలు పొందుతున్న బహుజన యూత్ ఫోర్స్

నెల్లూరు జిల్లా బ్యూరో (మనసులో మాట) మే 19: ఇటీవల స్థాపించిన బహుజన యూత్ ఫోర్స్ సంస్థ గూడూరు నియోజకవర్గంలో యువతను చైతన్యపరుస్తూ యువతలో సామాజిక బాధ్యతను రగుల్చుతూ, సమ సమాజ స్థాపన కోసం పోరాటం చేసిన మహనీయుల ఆలోచనలను భుజస్కందాలపై వేసుకొని బహుజన ఉద్యమ రథాన్ని ముందుకు లాగడం కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్న బహుజన యూత్ ఫోర్స్ సంస్థ అటు మహనీయుల మార్గంలో రాజీ లేని పోరాటం చేయడమే కాకుండా ఆపదలో ఉన్నవారికి అండగా నిలబడుతూ సమాజ సేవలో సైతం దూసుకుపోతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తుంది.ఈ నేపథ్యంలో నాయుడుపేట మండలం మడఫలం గ్రామానికి చెందిన దారా సంతోష్ నాయుడుపేటలోని అంబేద్కర్ గురుకుల పాఠశాల నందు చదివి 10 వ తరగతి పరీక్ష ఫలితాలలో 544 మార్కులు సాధించి గురుకులం టాపర్ గా నిలిచాడు.అటు చదువులోనూ ఇటు క్రీడలలో కూడా అండర్ 14 జాతీయ స్థాయి క్రీడల్లో సంతోష్ 2024-25 ఉత్తరప్రదేశ్ లోని గోరఖ్పూర్ లో జరిగిన కుస్తీ పోటీ లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున జాతీయ స్థాయి క్రీడాకారునిగా సంతోష్ గుర్తింపు పొందారు.అయితే సంతోష్ కుటుంబం కటిక పేదరికంలో ఉంది. ఉండటానికి సరైన ఇల్లు కూడా లేదు.ఉన్నత చదువులు చదువుకోవడానికి స్తోమత లేదు.అయితే ఇటీవల తన తల్లి మరణం,తండ్రి అనారోగ్య పరిస్థితి తన పై చదువులకి ఆటంకం కలిగింది.తండ్రిని ఎలా చూసుకోవాలో ఎలా చదవాలో దిక్కుతోచని నిస్సహాయ స్థితిలో బహుజన యూత్ ఫోర్స్ ను కలిసి సహాయం కోరాడు. వెంటనే స్పందించిన బహుజన యూత్ ఫోర్స్ నాయకులు మంగళవారం సంతోష్ స్వగృహంలో శాలువాలతో సత్కరించి ఐదు వేల రూపాయల నగదు ఆర్థిక సహాయం,పండ్లు అందించి మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు.అనంతరం స్కూల్ టాపర్ గా నిలిచిన దారా సంతోష్ ని అభినందించారు.ఈ సందర్భంగా బహుజన యూత్ ఫోర్స్ నాయకులు మాట్లాడుతూ దారా సంతోష్ చదువుకు పేదరికం అడ్డు కాకూడదని అతని చదువుకు బహుజన యూత్ ఫోర్స్ అండగా నిలుస్తుంది అని తెలిపారు. భవిష్యత్తులో దాతల సహాయంతో సంతోష్ చదువులకు దాతల సహాయంతో సంతోష్ వెన్నంటే ఉంటూ డాక్టర్ అవ్వాలని అతని కలని నెరవేర్చే దిశగా తమవంతు కృషి చేస్తామని తెలిపారు. బహుజన యూత్ ఫోర్స్ కన్వీనర్ శ్రీరామ్ శివప్రసాద్ (శంకర్) మాట్లాడుతూ దారా సంతోష్ కుటుంబానికి తాను ఒక పెద్ద కొడుకుల ఉండి డాక్టర్ చదవాలని సంతోష్ కోరికను తీర్చేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు.అనంతరం అన్ బిన్ సువడుగల్ సంస్థ డైరెక్టర్ భూపతి మోహన్ సాయి మాట్లాడుతూ దారా సంతోష్ ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాల చదువు కోసం అయ్యే పుస్తకాలను తన సంస్థ ద్వారా అందిస్తానని ప్రకటించారు. ఎవరైనా దాతలు నాయకులు స్పందించి చదువు పట్ల ఇంతటి మమకారం చూపుతున్న దారా సంతోష్ ఉన్నత చదువులకు సహాయం చేయాలని ఈ సందర్భంగా బహుజన యూత్ ఫోర్స్ నాయకులు తెలిపారు.ఆపదలో ఉన్న వారిని వెంటనే ఆదుకుంటూ పేద ప్రజలకు ఎవరికి ఏ సమస్య వచ్చిన మేమున్నామంటూ భరోసా కల్పిస్తూ వారికి ధైర్యాన్నిస్తున్న బహుజన యూత్ ఫోర్స్ సేవలను పలువురు ప్రశంసిస్తున్నారు. ఈకార్యక్రమంలో బహుజన యూత్ ఫోర్స్ కన్వీనర్ శ్రీరాం శివ ప్రసాద్,గౌరవ సలహాదారులు ఐవీ రమణయ్య,కర్లపూడి.వెంకట రమణయ్య, నాయకులు భూపతి మోహన్ సాయి,మీడియా కో ఆర్డినేటర్ పాకం చెన్నకేశవలు, న్యాయవాది దాసరి అశోక్ కాంబ్లే,బి.వై.ఎఫ్ నాయకులు దేవా,టీచర్ దారా బాబు,పీఈటీ టీచర్ కాటయ్య,పామంజి నాగేంద్ర, శ్రీరాం రవి,తూపిలి నిరంజన్,సుజిత్,బందిల గౌతమ్,తూపిలి వినోద్, ప్రశాంత్,రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కోతల బాబుకి వాతలు తప్పవు

- మత్సకారుల్ని ఆదుకున్న చరిత్ర జగన్ దే తేల్చిచెప్పిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి

- నెల్లూరులోని వైఎస్సార్సీపీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి

- జగన్ ను విమర్శించేందుకే కావలిలో సభ మత్సకారులకు భరోసా ఇవ్వని చంద్రబాబు

నెల్లూరు జిల్లా బ్యూరో (మనసులో మాట) మే 19: చంద్రబాబు నెల్లూరు జిల్లా కావలి పర్యటనలో మత్సకారుల సేవలో కార్యక్రమం పెట్టి నిస్సిగ్గుగా, నిర్లజ్జగా పచ్చి అబద్దాలు మాట్లాడారని, వారిని అన్ని విధాలుగా ముంచిన చరిత్ర ఆయనదే అని వైఎస్సార్సీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. చంద్రబాబు ఇచ్చిన మత్సకారుల భరోసా మొత్తం, డీజిల్ సబ్సిడీ, గల్లంతైన మత్సకార కుటుంబాలకు సాయం పెంచి ఇచ్చిన చరిత్ర జగన్మోహన్ రెడ్డిదే అన్నారు. చివరికి జగన్మోహన్ రెడ్డి పూర్తి చేసిన జువ్వల దిన్నె ఫిషింగ్ హార్బర్ విషయంలోనూ చంద్రబాబు కోతలకే పరిమితం అయ్యారని కాకాణి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. చంద్రబాబు కోతలకు ఎన్నికలు ఎప్పుడొచ్చినా మత్సకారులు వాతలు పెట్టడం ఖాయమని కాకాణి హెచ్చరించారు.

ప్రెస్ మీట్లో కాకాణి గోవర్ధన్ రెడ్డి ఇంకేమన్నారంటే..

కావలి సభలో చంద్రబాబు అబద్ధాలు

చంద్రబాబు నెల్లూరు జిల్లా కావలి పర్యటనకు వచ్చి మత్సకారుల సేవలో కార్యక్రమం ప్రారంభించారు. విజనరీ చంద్రబాబు తన ప్రసంగంలో ఎక్కడా మత్సకారులకు భరోసా కల్పించలేకపోయారు. ఇటీవల జగన్మోహన్ రెడ్డి కావలి పర్యటన తాలూకు వణుకు చంద్రబాబులో కనిపించింది. కావలిలో ఓ కార్యక్రమం పెట్టుకుని జగన్మోహన్ రెడ్డి ని విమర్శించాలనే ఉద్దేశం తప్ప మత్సకారులకు ఏం చేశాడు, ఏం చేయాలనుకుంటున్నాడు, మత్సకారులకు ఏం అన్యాయం జరిగిందన్న దానిపై ఎక్కడా మాట్లాడలేదు. చంద్రబాబు ప్రసంగంలో జగన్మోహన్ రెడ్డి గారు చెప్పిన అన్ని అంశాలు పరిగణనలోకి తీసుకుని తమకు న్యాయం చేస్తారని మత్సకారులంతా ఆశించారు. చంద్రబాబు కార్యక్రమానికి ఎంపిక చేసుకున్న మత్సకారుల్ని మాత్రమే అనుమతించారు. చంద్రబాబు గతంలో ఇక్కడ బహిరంగసభ పెట్టలేకపోయారు కాబట్టే స్థానిక టీడీపీ కార్యకర్తల్ని తరలించి మమా అనిపించేందుకు ప్రయత్నించారు. చంద్రబాబు తన వయసు, హోదా, ఉనికి అన్నీ మర్చిపోయి కావలిలో కోతలరాయుడు అవతారం ఎత్తారు. నిస్సిగ్గుగా, నిర్లజ్జగా అబద్దాలు ఎలా వల్లెవేయగలడో తుమ్మలపెంట కార్యక్రమం ఓ ఉదాహరణ. సమయం, సందర్భంతో సంబంధం లేకుండా కేవలం జగన్మోహన్ రెడ్డిని నిందించాలని ప్రయత్నించారు. గతంలోనూ దావోస్ కు వెళ్లినా, అమ్మవారి ఆలయాలకు వెళ్లినా, వినాయకుడి మండపాలకు వెళ్లినా చంద్రబాబు జగన్నామస్మరణే. జగన్మోహన్ రెడ్డి గారి మీద చంద్రబాబు విమర్శలు ఆయన బరితెగింపుకు నిదర్శనంగా కనిపిస్తున్నాయి. జగన్మోహన్ రెడ్డి గారు ఏం చేశాడో, తానేం చేస్తున్నాడో చంద్రబాబు చెప్పులేకపోయారు. మిగతా విషయాలన్నీ చెప్పుకొచ్చారు.

తొలి ఏడాదే మత్సకార భరోసా ఎందుకివ్వలేదు ?

చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది మత్సకారుల భరోసా ఎందుకు ఇవ్వలేదో చెప్పాలి. అంటే మత్సకారుల్ని వేట నిషేధం సమయంలో డబ్బులు ఇవ్వకుండా తొలి ఏడాది మోసం చేశారు. ఇవాళ అర్హత కలిగిన వారికి కూడా మత్సకారుల సేవలో డబ్బులు జమ చేయకుండా తొలగించారు.

ముందుగా లక్షా 52 వేల మందిని ఎంపిక చేశామని చెప్పారు. తర్వాత అనేక కారణాలు చూపించి లక్షా 43 వేల మందికి కుదించారు. ఇప్పుడు చంద్రబాబు లక్షా 31 వేల మందికి ఇస్తున్నట్లు చెప్పారు. అర్హులకు అన్యాయం చేసిన తర్వాత ప్రకటించిన జాబితాలో ఉన్న వారిలోనూ 21 వేల మందిని తొలగించడం దారుణం కాక మరేమిటి ? ఇదేనా మత్సకారులకు మీరు చేస్తున్న సేవ ? మత్సకారులకు రెండేళ్లుగా డీజిల్ సబ్సిడీని కూడా కోత పెట్టి మొండి చేయి చూపించింది కాక ఇప్పుడు నాలుగు మాటల రాసుకొచ్చి సభలో అబద్దాలు వల్లెవేస్తున్నారు.

మత్సకారుల్ని అన్ని విధాలా ఆదుకున్నది జగనే

చంద్రబాబు గతంలో మత్సకార భరోసా నాలుగు వేలే ఇస్తే జగన్మోహన్ రెడ్డి గారు దాన్ని 10 వేలకు పెంచి ఐదేళ్ల పాటు రూ.538 కోట్లు మత్సకార కుటుంబాలకు ఇచ్చారు. 2014లో అధికారంలోకి వచ్చాక వేట నిషేధ సమయంలో మత్సకారులకు చంద్రబాబు ఇచ్చింది 2 వేలే. ఆ తర్వాత ఎన్నికలకు వెళ్తూ 4 వేలకు పెంచారు. దాన్ని జగన్మోహన్ రెడ్డి నిరంతరాయంగా పది వేల చొప్పున ఇచ్చారు. చంద్రబాబు 2014-15లో మత్సకార భరోసా 12,128 కుటుంబాలకు మాత్రమే ఇచ్చారు. అలాంటి ఘనుడు మత్సకారులకు సేవ చేస్తానంటే నీటిలో చేపలు కూడా సిగ్గుపడతాయి. వాటికి మెదడు ఉంటే చంద్రబాబును ఛీకొడతాయి. 2018-19లో ఎన్నికల సమయంలో 4 వేలకు పెంచి 12 వేల కుటుంబాలకు బదులు 80 వేల కుటుంబాలకు ఇచ్చారు. అలా చూసినా 2014-15 ఒక్క సంవత్సరంలో చంద్రబాబు ఇచ్చింది 2.50 కోట్లు. ఐదేళ్లలో ఇచ్చింది చూస్తే ఇచ్చింది రూ.32 కోట్లు. అదే జగన్మోహన్ రెడ్డి రూ.538 కోట్లు మత్సకారులకు ఇచ్చారు. డీజిల్ సబ్సిడీ సైతం చంద్రబాబు హయాంలో లీటరుకు రూ.6 ఇస్తే జగన్మోహన్ రెడ్డి వచ్చాక రూ.9 కు పెంచారు. అలాగే మత్సకారులకు కార్డులు ఇచ్చి మరీ ఈ పథకం అమలు చేశారు. జగన్మోహన్ రెడ్డి హయాంలో అర్హత కలిగిన 24,034 బోట్లకు డీజిల్ సబ్సిడీ కింద నాలుగేళ్ల పాటు రూ.98 కోట్లు ఇచ్చాం. చివరి సంవత్సరంలో మరో 50 కోట్లు మంజూరు చేసాం. మత్సకారులు గల్లంతు అయితే చంద్రబాబు పెట్టిన బకాయిలతో సహా జగన్మోహన్ రెడ్డి గారు ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలు చెల్లించారు.

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పైనా చంద్రబాబు కోతలు

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పైనా చంద్రబాబు అబద్దాలే చెప్పారు. రూ.288 కోట్లు ఖర్చుపెట్టామని, 80 శాతం పూర్తి చేశామని చెప్పడం అబద్దం. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ మీద చంద్రబాబు రూపాయి కూడా ఖర్చుపెట్టలేదు. జగన్మోహన్ రెడ్డి పుణ్యమాని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ వచ్చింది తప్ప చంద్రబాబు తట్టెడు మట్టి కూడా ఎత్తలేదు, రూపాయి కూడా ఖర్చుపెట్టలేదు. ఇంత పచ్చి అబద్దాలు చెప్పే వాళ్లు ప్రపంచంలో ఎక్కడా లేరు. జగన్మోహన్ రెడ్డి హయాంలోనే ఫిషింగ్ హార్బర్ ప్రారంభించారు. కొత్తగా నాలుగు పోర్టులు అదనంగా తెచ్చారు. వాటితో పాటు 10 ఫిషింగ్ హార్బర్లకు కేంద్రం అనుమతులు తెచ్చారు. 16 వేల కోట్లతో 4 పోర్టులకు జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారు, అలాగే రూ.3800 కోట్లతో 10 ఫిషింగ్ హార్బర్లు, రూ.150 కోట్లతో ఐదు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లకు శ్రీకారం చుట్టారు. ఇలా 20 వేల కోట్ల పనులకు శ్రీకారం చుట్టడమే కాకుండా ఇంకో 6 వేల కోట్లతో వాటిని విస్తరించేందుకు కూడా ప్లాన్ చేశారు. అన్నిరకాల అనుమతులు, బ్యాంకుల లోన్లు తీసుకొచ్చారు. అన్నీ పూర్తయ్యాక తానే చేసినట్లు చంద్రబాబు చెప్పుకోవడం సిగ్గుచేటు. కాబట్టి చంద్రబాబుకు మత్సకారుల గురించి మాట్లాడే హక్కు లేదు. మత్సకారుల్ని ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకుంటున్న చంద్రబాబు మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్లుంది.

జగన్మోహన్ రెడ్డి 2024లో అధికారంలోకి వచ్చి ఉంటే దాదాపు 20 వేల మందిని బోట్లకు ఓనర్లను చేసేవారు. 200 మెకనైజ్డ్ బోట్లను తీసుకురావాలని భావించారు. ఇప్పుడు ఆయన తెస్తానని చెప్పుకుంటున్నారు.వాస్తవానికి జగన్మోహన్ రెడ్డి గారు 1200 మెకనైజ్డ్ బోట్లు తీసుకురావాలని ప్లాన్ చేశారు. మత్సకారుల్ని ఆయా బోట్లకు ఓనర్లను చేయాలనుకున్నారు.

చంద్రబాబుకూ, జగన్ కూ తేడా ఇదీ..

మత్సకారులకు ఉన్న సదుపాయాలు చాలవని, విస్తరణకు వెళ్లాలని జగన్మోహన్ రెడ్డి భావిస్తే.. ఇప్పుడు చంద్రబాబు, లోకేష్ ఇద్దరూ కలిసి సాగర్ డిఫెన్స్ సంస్థకు ఇచ్చి జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ప్రైవేటీకరణకు బరితెగిస్తున్నారు. ఒకవేళ చంద్రబాబు ప్రభుత్వం సాగర్ డిఫెన్స్ కు ఈ హార్బర్ కు ఇచ్చినా వైఎస్సార్సీపీ ప్రభుత్వం రాగానే రద్దు చేస్తామని గతంలోనే చెప్పాం. ఇవాళ టీడీపీకి సంబంధించిన మత్సకారులు కూడా చంద్రబాబును ఛీకొట్టే పరిస్థితి ఉంది. చంద్రబాబు ఏరోజైనా మత్సకారుల గురించి అయినా, తీర ప్రాంత ప్రజల గురించి ఆలోచన చేశారా ? అలా చేసింది కేవలం జగన్మోహన్ రెడ్డి మాత్రమే. ఇప్పటికైనా చంద్రబాబు డైవర్షన్ డ్రామాలు కట్టిపెట్టాలి. వైఎస్సార్సీపీ, టీడీపీ ఎప్పటికీ ఒక్కటి కావు. బోట్ ఆర్ నాట్ సేమ్. నయవంచనతో, దగాతో పుట్టిన పార్టీ టీడీపీ అయితే ఓ ఆలోచనతో, స్ఫూర్తితో పుట్టిన పార్టీ వైఎస్సార్సీపీ అన్నది గుర్తుంచుకోవాలి. కోతల రాయుడు చంద్రబాబుకు ఏ రోజు ఎన్నికలు వచ్చినా వాతలు పెట్టేందుకు మత్సకారులు సిద్ధంగా ఉన్నారని కాకాణి గోవర్ధన్ రెడ్డి హెచ్చరించారు.

తిరుపతి జిల్లా జలధారజలహారతి కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేయాలి

- ప్రతి నీటి బొట్టును కాపాడటం ద్వారా భవిష్యత్తు తరాలకు నీటి భద్రత కల్పిద్దాం.

- జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి జిల్లా బ్యూరో మే 19 (మనసులో మాట): జలధారజలహారతి మరియు నీటి సంఘాల బాధ్యత కార్యక్రమాలను జిల్లాలో సమగ్రంగా, ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అధికారులతో ప్రత్యక్షంగా, మండల స్థాయిలో ఎంపీడీవోలు, ఇరిగేషన్ సిబ్బంది, ఏ పి ఓ లు , డ్వామా, హార్టికల్చర్, ఆర్‌డబ్ల్యూఎస్, తదితర అధికారులతో వర్చువల్ విధానంలో నిర్వహించిన సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, చెరువులు, కాలువలు, కుంటల పునరుద్ధరణ కార్యక్రమాలను సమన్వయంతో చేపట్టాలని సూచించారు. ప్రతి గ్రామంలో నీటి వనరులను గుర్తించి, వాటి పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు.

జిల్లా లో ఇప్పటి జలదార – జలహారతి కార్యక్రమం ద్వారా 4143 పనులను గుర్తించడం జరిగిందన్నారు. అందులో 3376 పనులకు అనుమతులు ఇచ్చామన్నారు. వాటిలో 1536 పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 27 పనులు పూర్తి అయిందని తెలిపారు. అనుమతులు ఇచ్చిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

ప్రతి నీటి బొట్టును కాపాడటం ద్వారా భవిష్యత్తు తరాలకు నీటి భద్రతను కల్పించగలం" అని కలెక్టర్ పేర్కొన్నారు. నీటి వృథాను నివారించడంతో పాటు, వర్షపు నీటిని నిల్వ చేసే చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.జలధారజలహారతి కార్యక్రమంలో భాగంగా చెరువుల పూడిక తొలగింపు, కాలువల శుభ్రత, వర్షపు నీటి నిల్వ నిర్మాణాలు, ఇంకుడు గుంతలు, పంట పొలాల్లో నీటి సంరక్షణ చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు.

గ్రామస్థాయిలో నీటి సంఘాలను చురుకుగా పనిచేసేలా చేసి, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలిపారు. ప్రతి శాఖ సమన్వయంతో పనిచేస్తేనే నీటి వనరుల సంరక్షణ లక్ష్యాలు సాధ్యమవుతాయని చెప్పారు.

జలధారజలహారతి కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం వహించకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని, పురోగతిపై తరచూ సమీక్షలు నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డ్వామా పిడి ఏం. సి. మద్దిలేటి, ఇరిగేషన్ ఎస్ ఈ రాధాకృష్ణ, ఏపిడి లు తదితరులు పాల్గొన్నారు.